క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ


చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన సారంపల్లి పోషన్నకు సీఎం సహాయ నిధి నుంచి రూ.16వేల చెక్కు మంజూరు కాగా శనివారం కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాసరి చంద్రమౌళి, నాయకులు సముద్రాల రాజన్న, శంకర్‌గౌడ్, చందు తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

లింగాపూర్: మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో వీధి దీపాలు లేక రాత్రి వేళ ప్రజలు బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రామచందర్, ఎంపీవో రజనీకాంత్‌కు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. నాయకులు ఆడే లక్కా, జాటోత్ రాహుల్, ఆడే అనిల్, సునావత్ కిషన్, అంబాజి, బాపురావు తదితరులు ఉన్నారు.

'దేశ నిర్మాణమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం'


మాట్లాడుతున్న సత్యనారాయణ

ఆసిఫాబాద్అర్బన్: వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని జనగామ ఖండ బౌద్ధిక్ ప్రముఖ్ శ్రీరాం సత్యనారాయణ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆర్ఎస్ఎస్ గోయగాం ఉప మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక గోయగాం కమ్యూనిటీ హాలులో విజయదశమి ఉత్సవాలను శుక్రవారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో ఆదె శంకర్‌పటేల్, గ్రామ పెద్దలు లక్ష్మణ్, గోయగాం ఉత్సవ సమితి సభ్యులు, జనగామ ఖండ కార్యకారిణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాయితీ సిలిండర్ల పట్టివేత


పట్టుకున్న రాయితీ సిలిండర్లు

ఆసిఫాబాద్: జైనూర్ మండల కేంద్రంలోని హోటళ్లలో శనివారం పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్రీనివాస్‌లు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తెలంగాణ మీల్స్ హోటల్, రాహుల్ టీ పాయింట్, ఉర్వేత ఫ్యామిలీ రెస్టారెంట్, చండీ బాబా, పాండ్యవర్ చాయ్ హోటళ్లలో అక్రమంగా వినియోగిస్తున్న 5 రాయితీ సిలిండర్లు స్వాధీనం చేసుకొని, సంబంధిత యజమానులపై చర్యలకు నివేదికలు పంపినట్లు డీటీలు తెలిపారు.

పీహెచ్‌సీలో పిచ్చిమొక్కలు


ఆసుపత్రి వెనుకభాగంలో పిచ్చిమొక్కలు

కెరమెరి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వెనుకభాగంలో పిచ్చి మొక్కలు పెరగడంతో రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. వెనుకవైపు చెత్తాచెదారంతో పాటు గుబురుగా మొక్కలు పెరిగాయి. పాములు, ఇతర విష కీటకాలు పీహెచ్‌సీలోకి వచ్చే ఆస్కారం ఉందని, అధికారులు స్పందించి వెంటనే పిచ్చిమొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

బెల్ట్‌షాపులు మూసివేయాలి

ఇచ్చోడ: ఏజెన్సీ ప్రాంతమైన ఇచ్చోడ మండల కేంద్రంలో నడుస్తున్న బెల్ట్‌షాపులు వెంటనే మూసి వేయాలని ఆదివాసీ సంఘం నాయకులు శనివారం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో మాట్లాడారు. పెసా చట్టానికి విరుద్ధంగా విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

తాగునీటి తంటా..!


కంచర్‌పేట్ గ్రామంలో తాగునీటి కోసం మహిళల పాట్లు

- మిషన్ భగీరథ నీళ్లు రాక అవస్థలు
- పట్టించుకోని అధికారులు

సిర్పూర్(టి): మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు. గత వారం రోజులుగా మిషన్ భగీరథ తాగునీరు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం కావడంతో కలుషిత నీరు తాగితే వ్యాధుల బారిన పడతామని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గ్రామాల్లో ఉన్న చేతిపంపు బోరింగులు పని చేయకపోవడంతో పాటు తాగునీటి వసతి లేకపోవడంతో ప్రతీరోజు అవస్థలు తప్పడం లేదు.

ఆయా గ్రామాల్లో..

సిర్పూర్(టి) మండల కేంద్రంలోని వార్డుల్లో వారం రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. కాలనీల్లో ఉన్న చేతి పంపు బోరింగు నీటినే తాగుతూ కాలం వెళ్లదీస్తున్నారు. కలుషితమైన బోరింగు నీటితో ఆరోగ్యంపై భయాందోళనలకు గురవుతున్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని అరబ్ కాలనీలో వారం రోజుల నుంచి తాగునీరు రాకపోవడం, కాలనీలో ఉన్న చేతి పంపు బోరింగు చెడిపోవడంతో తాగునీటి కోసం కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎస్టీ కాలనీలో భగీరథ నీరు రాకపోవడంతో దూర ప్రాంతంలో ఉన్న చేతిపంపు బోరింగు నుంచి తాగునీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని కంచర్‌పేట్ గ్రామంలో మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో గ్రామస్తులు తాగునీటి కోసం నరకం అనుభవిస్తున్నారు. గ్రామంలో ఉన్న చేతి పంపు బోరింగు చెడిపోవడంతో గ్రామంలో తాగునీటి వసతి లేకుండా పోయింది. దీంతో గ్రామంలో ఉన్న బావిని గ్రామస్తులంతా కలిసి మరమ్మతులు చేసుకున్నారు. అయితే వర్షాకాలం కావడంతో నీరు కలుషితంగా ఉండడతో ఆ నీటిని తాగలేకపోతున్నారు. గ్రామంలో ఉన్న ఓ ఇంటి యజమాని ఇంట్లో ఉన్న బోరింగు నీటినే తాగుతున్నామని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న చేతి పంపు బోరింగుకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


సిర్పూర్(టి) అరబ్ మహెలాలో మరమ్మతులకు నోచుకోని చేతిపంపు

సరఫరాకు సమ్మె ఎఫెక్ట్..

మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత వారం రోజుల నుంచి నిరవధిక సమ్మె కొనసాగిస్తుండటంతో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోయింది. కార్మికుల సమస్యల పరిష్కారంపై అధికారులు చొరవ చూపాలని, ప్రజల తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కలుషిత నీరే దిక్కు..



గ్రామంలో బోరింగు చెడిపోవడంతో గత వారం రోజుల నుంచి తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలం కావడంతో కలుషిత నీరు తాగితే రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. తాగునీరు సరఫరా జరిగేలా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి.
– కవిత, కంచర్‌పేట్

తాగునీరు సరఫరా చేయాలి



గ్రామంలో వారం రోజుల నుంచి తాగునీరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చేతి పంపులు చెడిపోవడంతో పాటు ఇతర ప్రత్యామ్నాయాలు లేకపోవడంతో మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ అధికారులు తక్షణమే స్పందించి మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలి.
– ప్రసాద్, కంచర్‌పేట్

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం'

కౌటాల: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు సత్తాచాటాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అంతకు ముందు కన్నెపల్లి, తలోడి గ్రామాల నుంచి పలువురు మహిళలు కాంగ్రెస్‌లో చేరడంతో వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, నాయకులు గంగారాం, ఉమా మహేశ్, నానయ్య, యశ్వంత్‌రావ్, భాస్కర్, ఖాలీం పాషా, పోశం, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్సీ దండె విఠల్

సులభ్ కాంప్లెక్స్ సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన: మండల ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం మండల కేంద్రంలో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శనివారం సులభ్ కాంప్లెక్స్ ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రజలతో పాటు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికుల సౌకర్యార్థం సులభ్ కాంప్లెక్స్ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకరమ్మ, మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, మాజీ వైస్ చైర్మన్ మహేశ్‌గౌడ్, మధునయ్య, భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.


సులభ్ కాంప్లెక్స్ ప్రారంభిస్తున్న కోవ లక్ష్మి

అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలతో పాటు స్వామివారి వాహన ఊరేగింపులో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. హన్మంత వాహనంలో స్వామివారిని ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాగా ఆలయంలో ప్రతీరోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.


హన్మంత వాహనంలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు


కెరమెరి: దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు


ఆసిఫాబాద్అర్బన్: అన్నప్రసాద వితరణలో భక్తులు


కెరమెరి: లలితాదేవి రూపంలో అమ్మవారు


కాగజ్‌నగర్‌టౌన్: ఆర్‌ఆర్‌వో కాలనీలో లలిత త్రిపుర సుందరి అవతారంలో అమ్మవారు

కెరమెరి: మండల కేంద్రంలో తుజాల్‌పురం కాంప్లెక్స్‌లోని దుర్గాదేవి శనివారం ఆరో రోజు లలితాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈసందర్భంగా దుర్గామాతకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నా, పెద్దా అనే తారతమ్యం లేకుండా ఉదయం, సాయంకాలం అమ్మ వారి ప్రతిమల వద్ద మహిళలు ప్రత్యేక గీతాలాపన చేస్తున్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాగజ్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన దుర్గామాత శనివారం వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చింది. పట్టణంలోని కన్యాకాపరమేశ్వరి దేవాలయంలో లక్ష్మీదేవిగా, ఆర్‌ఆర్‌వో కాలనీలోని అమ్మవారు లలితత్రిపుర సుందరిగా, ఎల్లగౌడ్‌తోటలో అమ్మవారిలా భక్తులకు దర్శనమిచ్చింది. మార్కెట్ ఏరియా, త్రిశూల్‌పహాడ్ దుర్గామాత మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని బాపూనగర్‌లో శరన్నవరాత్రులను పురస్కరించుకొని శనివారం శారదా గణేశ్ మండలి వద్ద మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్‌లు మొదట శారదామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులకు వడ్డించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పుల్లూరి రవీందర్, పిన్నా వివేక్, అశ్విన్, బాబుగౌడ్, శ్రీనివాస్, మహేందర్, రంజిత్, ప్రభాకర్, ప్రశాంత్, ప్రతాప్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, అన్నపూర్ణ, వైశాలి, రజిన, శిరీష, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి


కాగజ్‌నగర్‌టౌన్: నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు


కెరమెరి: నివాళులర్పిస్తున్న అధికారులు


ఆసిఫాబాద్‌రూరల్: పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాగేశ్వర్ రావు

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో లక్ష్మణ్ సేవా సదన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ట్రస్ట్ చైర్మన్ గాదె అవినాష్ మాట్లాడుతూ వాంకిడిలో పుట్టిన బాపూజీ స్వాతంత్ర్య సమరయోధుడిగా, తెలంగాణ ఉద్యమకారుడిగా అనేక పోరాటాలు సాగించారన్నారు. అనంతరం మహిళా జీపీ కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. లక్ష్మణ్ సేవా సదన్ ట్రస్ట్ వైస్‌చైర్మన్ అశోక్ మహోల్కర్, ప్రధాన కార్యదర్శి మడావి దౌలత్, కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..

మండల కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం మండల అధ్యక్షుడు సతీశ్, నాయకులు బండు, మొండయ్య, మహేందర్, పెంటయ్య, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ సంతోష్ కుమార్, ఆర్‌ఐ పవన్‌నాయక్, సిబ్బంది సేవంత, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ సిద్ధాంత కర్త ఆచార్య శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి పట్టణంలోని పద్మశాలి భవనంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలను కొనియాడారు. పట్టణంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. భవన నిర్మాణ కమిటీ సభ్యులు సిందం చంద్రయ్య, రాష్ట్ర నాయకులు కనకయ్య, రాపెల్లి సదానందం, గుల్లపల్లి నాగేశ్వర్‌రావు, గడదాసు మల్లయ్య, దోమల సురవర్ధన్, నూతి సుదర్శన్, సిందం శ్రీనివాస్, సుంక లింగమూర్తి, గడదాసు శంకరయ్య, మాచర్ల శ్రీనివాస్, భీమయ్య పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్ర భావితరాలకు ఆదర్శంగా నిలిచిందని మాజీ జెడ్పీటీసీ నాగేశ్వర్ రావు అన్నారు. శనివారం బీజేపీ కార్యాలయంలో నాయకులతో కలిసి లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పద్మశాలీ సేవ సంఘం ఆధ్వర్యంలో పద్మశాలీ సంఘం భవనంలో లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా పూలమాల వేసి నివాళులర్పించారు పద్మశాలీ సంఘం నాయకులు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, నాయకులు పెంటు, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్, మాదారం టౌన్‌షిప్‌లలో ఈనెల 29న నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ (ఫ్యామిలీ డే) వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏరియా జీఎం విజయ భాస్కర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంతో పాటు మాదారంలోని రామాలయం ప్రాంగణంలో సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అందంగా అలంకరించిన బతుకమ్మలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వేడుకలకు ఏరియాలోని సింగరేణి కార్మికులు, సమీప గ్రామాల ప్రజలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు


రెబ్బెన: బతుకమ్మలతో మహిళా ఉద్యోగులు


కాగజ్‌నగర్‌టౌన్: సంబరాల్లో పాల్గొన్న మహిళలు


బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని పద్మశాలీ కమ్యూనిటీ హాలులో పద్మశాలీ భవన కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి హాజరయ్యారు. మహిళలు బతుకమ్మను రంగురంగుల పూలతో పేర్చి పాటలు పాడుతూ ఆటలు ఆడారు. కార్యక్రమంలో మహిళలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


జీఎం కార్యాలయంలో..

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ ఆవరణలో శనివారం మహిళా ఉద్యోగులు బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం సెలవు కావడంతో జీఎం కార్యాలయ ఉద్యోగులు ముందస్తుగా బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా తయారుచేసి జీఎం కార్యాలయ ఆవరణలో బతుకమ్మ ఆడుతూ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో శనివారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. మహిళా అధికారులు, సిబ్బందితో కలిసి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి బతుకమ్మ పాటలకు స్టెప్పులు వేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతిని పూజించే సంస్కృతికి నిదర్శనంగా తెలంగాణలో ఆడపడుచులు బతుకమ్మ పండుగ జరపుకొంటారని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా ప్రకృతిలో లభించే పూలను సేకరించి బతుకమ్మగా పేరుస్తారన్నారు. జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, డీటీడీవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లతో ఇబ్బందులు


తీరందాజ్ టాకీస్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు వెళ్లే మార్గంలో గుంతలమయంగా రోడ్డు

లారీ చౌరస్తా సమీపంలో..



అంబేద్కర్ చౌరస్తా వద్ద..



కాగజ్‌నగర్‌టౌన్: వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రధాన రోడ్లు గుంతలమయంగా మారి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని పెట్రోల్ పంప్ ఏరియాలోని తెలంగాణ తల్లి చౌరస్తా సమీపంలో, తీరందాజ్ టాకీస్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు, ఈఎస్‌ఐ మూలమలుపు నుంచి లారీ చౌరస్తా రోడ్డు మార్గంలో, రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్లపై వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గుంతలతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టణ రోడ్లను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.